క్లుప్తంగా

రజకుల గ్రామ బహిష్కరణ హేయమైన చర్య



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నిజామాబాద్ జిల్లా దేగావ్ గ్రామంలో రజకులను గ్రామ బహిష్కరణ చేయడం అత్యంత హేయమైన చర్య అని రజక రిజర్వేషన్ పోరాట సమితి ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు శివన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రజకులను గ్రామ బహిష్కరణ చేసిన పెత్తందారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగన్న, రాజు, యాదేష్ కుమార్, యాదయ్య, నాగమణి, చంద్రయ్య, కేశవులు, నర్సింహ ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



జడ్చర్ల టౌన్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. వార్డుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై పక్కా సమాచారం ఉండాలన్నారు. కాలనీల్లో ఉన్న సింగిల్‌ఫేజ్ బోర్లకు మరమ్మతు చేయించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు బుక్క మహేష్, రఘురాంగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, చైతన్య చౌహాన్, రహీం, కుమ్మరిరాజు, విజయ్ ఉన్నారు.

కురుమూర్తిస్వామి సన్నిధిలో కందనూలు ఎమ్మెల్యే




చిన్నచింతకుంట: అమ్మాపూర్ కురుమూర్తి స్వామిని గురువారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

సత్తా చాటిన 'అక్షర' విద్యార్థులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ మొదటి దశ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని అక్షర కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. కళాశాల విద్యార్థి చరణ్‌తేజ 98.78 పర్సంటేజీ సాధించారు. అదే విధంగా శృతి, హర్షవర్ధన్, అఖిల్‌గౌడ్, అనుదీప్‌తో పాటు మరికొందరు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు అకాడమిక్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలతో పాటు జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు జియాఉద్దీన్, హరికృష్ణ, విష్ణువర్ధన్, యాకూబ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ



దేవరకద్ర రూరల్: జేఈఈ మెయిన్స్‌లో దేవరకద్ర మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి మహమ్మద్ సల్మాన్ 97.25 పర్సంటేజీ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రెహ్మతుల్లా తెలిపారు. ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థితో పాటు అతడి తల్లిదండ్రులను గురువారం కళాశాల అధ్యాపకులు శాలువాతో సత్కరించి అభినందించారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

మహమ్మదాబాద్/కోయిల్‌కొండ/హన్వాడ/నవాబుపేట: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం మండల కార్యాలయాల్లో అఖిలపక్ష సమావేశాలను ఏర్పాటు చేశారు. మహమ్మదాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఓటరు జాబితాను పరిశీలించాలని తెలిపారు.

■ కోయిల్‌కొండ మండలంలో 18 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి 92 పోలింగ్ బూత్‌లను గుర్తించినట్లు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. మొత్తం 52,499 మంది ఓటర్లకు గాను 26,204 మంది మహిళలు, 26,293 మంది పురుషులు, ఇద్దరు ఇతరులు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని అఖిలపక్ష నాయకులకు సూచించారు.



నవాబుపేటలో అఖిలపక్ష నాయకులతో సమావేశమైన అధికారులు

■ నవాబుపేట మండలంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. గ్రామానికో పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో ఎవరికి ఏ ఇబ్బంది ఉండదన్నారు. కాగా, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమం వాయిదా పడింది.

■ హన్వాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ యశోద ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై అన్ని పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకుల సందేహాలను నివృత్తి చేశారు.

కేంద్ర బృందం పరిశీలన



అడ్డాకుల: మూసాపేట ఎమ్మార్సీ కార్యాలయాన్ని గురువారం కేంద్ర సీనియర్ సెక్షన్ అధికారుల బృందం పరిశీలించింది. ఎమ్మార్సీ పనితీరుపై సెక్షన్ అధికారులు అమిత్‌వర్మ, సోనీ కుమారి, మీనా కుమారి, మౌనిక వాకబు చేశారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేసే నవాబుపేటలోని అక్షయపాత్ర కేంద్రాన్ని వారు శుక్రవారం సందర్శించనున్నట్లు ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తారని చెప్పారు. ఇదిలా ఉండగా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను కూడా అధికారుల బృందం సందర్శించింది. పింఛన్ల పంపిణీ గురించి ఆరా తీశారు. వారి వెంట తహసీల్దార్ రాజు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు



జడ్చర్ల: పంటల సాగులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం వల్ల అత్యధిక దిగుబడులను సాధించే అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని కోడ్గల్‌లో మొక్కజొన్న పంట క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్, పీజేటీఏయూ అధికారులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తి అవుతుందని.. తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇథనాల్‌ను పెట్రోల్‌లో వినియోగిస్తారని, ఇది జీహెచ్‌జీ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయులు, ఏఓ గోపినాథ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు సునీల్, లక్ష్మిసౌజన్య, కిషోర్ కుమార్, సుజాత, వాణిశ్రీ పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



దేవరకద్ర రూరల్/చిన్నచింతకుంట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం కౌకుంట్ల, చిన్నచింతకుంట మండల కేంద్రాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బరిలో నిలిచేందుకు పార్టీ నేతలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఆ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. కాగా, కౌకుంట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఆ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మండల, అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు బాలచందర్‌గౌడ్, కోట రాము, మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, వేణుగోపాల్, రాములు, శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జహంగీర్, విజయ్ పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

నారాయణపేట: దామరగిద్ద మండలంలోని ఉల్లిగుండం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామస్తుల కథనం మేరకు.. చంద్రోల్ల వెంకటప్ప ఇంటి తాళం విరగొట్టి బీరువాలోని రూ.లక్ష 20 వేల నగదు, తులం బంగారు చోరీ చేశారు. అదే విధంగా వేరే ఇళ్లలో దొంగతనానికి యత్నిస్తుండగా గమనించిన స్థానికులు వెంటపడ్డారు. ఈ క్రమంలో దొంగలు వారి ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. ఏఎస్‌ఐ అరుణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

నవాబుపేట: గిరిజనుల అభ్యున్నతికి ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను గురువారం గిరిజన నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో తమకు ఎలాంటి హోదా లేకపోయినా సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమాలకు అన్నివిధాలా సహకరిస్తూ.. అండగా నిలిచినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసీ రాంనాయక్, వెంకటేష్ గౌడ్, గిరిజన నాయకులు శంకర్, గోపాల్, సంతోష్, అంబదాస్, నీల్యా, భాస్కర్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఆలయాలను నిర్మించే అదృష్టం ఉండాలి

రాజాపూర్: దేవాలయాలను నిర్మించేందుకు అదృష్టం ఉండాలని.. ఇలాంటి మంచి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. రాజాపూర్‌లో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కప్పెరి బచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు సొంత ఖర్చుతో నిర్మించిన పరశురాముడి, పోచమ్మ ఆలయాల్లో గురువారం దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చిరెడ్డి, యాదయ్య, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరహరి, కృష్ణయ్య, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, విక్రంరెడ్డి నసీర్, తఖీబాబా పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి కార్మికుల భిక్షాటన

జడ్చర్ల టౌన్: నెలల తరబడి వేతనాలను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రి కార్మికులు భిక్షాటన చేపట్టారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆస్పత్రికి వచ్చిన రోగులు, బంధువులతో పాటు ఆస్పత్రి పరిసరాల్లోని పెట్రోల్‌బంక్, టీకొట్టు, రోడ్డుపై వచ్చిపోయే వారితో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను 7 నెలలుగా ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఏజెన్సీపై ఒత్తిడి తీసుకువస్తే రెండు నెలల వేతనాలను ఐదునెలల క్రితం ఇచ్చారని తెలిపారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 19న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసి నాయకులు కృష్ణయాదవ్, ఆస్పత్రి బ్రాంచ్ అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, నవీన్, పేరుమాల్, రాజేష్, యాదమ్మ, శ్రీలత, భార్గవి, చెన్నమ్మ, నీరజ, నర్సమ్మ, అలివేల, మంగమ్మ, సుక్కమ్మ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న ఆస్పత్రి కార్మికులు

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

జడ్చర్ల టౌన్: ప్రతి విద్యార్థి అన్ని అంశాలపై సమగ్ర నైపుణ్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్మద అన్నారు. స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు 'ఉపాధి కల్పన – సాఫ్ట్ స్కిల్స్' అంశంపై ఆరు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ఎంతో మంది విద్యార్థులు పట్టభద్రులుగా ఉత్తీర్ణత సాధించినప్పటికీ.. ఉద్యోగ సాధనలో వెనకబడి ఉన్నారన్నారు. ఇందుకు ప్రధాన కారణం ఉద్యోగ సాధనకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్ లేకపోవడమేనని అన్నారు. టీఎస్‌కేసీ ద్వారా ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ చందర్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా.నాగలక్ష్మి, వీరప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ నర్మద

■ కళాశాల ఐక్యూఏసి, మహిళా సాధికారత విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మహిళల వ్యక్తిగత ఆర్థిక నిర్వహణ – అక్షరాస్యత' అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఫలక్‌నుమ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర సహాయ అధ్యాపకుడు ప్రభు సహాయ్ హాజరై మాట్లాడారు. మహిళలు డబ్బును ఎలా ఆదా చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసి సమన్వయకర్త డా.మాధురి, సాధికారత విభాగం సమన్వయకర్త పుష్పలత పాల్గొన్నారు.

ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంటే రోగులు ఎలా వస్తారు?

● భూత్పూర్ పీహెచ్‌సీ నిర్వహణపై కలెక్టర్ అసహనం



భూత్పూర్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

భూత్పూర్: ప్రభుత్వ ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంటే రోగులు ఎలా వస్తారని కలెక్టర్ విజయేందిర బోయి అసహనం వ్యక్తం చేశారు. గురువారం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వైద్యాధికారి అబ్దుల్ రబ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని కమిషనర్ నూరుల్ నజీబ్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించి.. కాన్పుల వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కాన్పు కోసం వచ్చిన గర్భిణి వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ ఆస్పత్రిలో ఉండగానే గర్భిణి సాధారణ కాన్పులో పండంటి బిడ్డ జన్మించింది. విషయం తెలుసుకున్న కలెక్టర్.. మరోసారి ఆమె వద్దకు వెళ్లి కొంత ఆర్థికసాయం అందించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ ప్రభాకర్, ఎంపీఓ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

పాలకొండ పాఠశాల తనిఖీ..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పాలకొండ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. 6వ తరగతి విద్యార్థులతో ఇంగ్లిష్, తెలుగు పాఠ్యాంశాలను చదివించి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో వంటగది నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ బాలుయాదవ్ ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామ వికాసం

మహబూబ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామ వికాసం జరుగుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపూర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 8 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కేవీఆర్ ఫౌండ్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా రూ. 40 లక్షలు ధర్మాపూర్‌కు కేటాయించామని.. గ్రామంలో అన్ని అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం, తండాకు బీటీరోడ్డు సౌకర్యం సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమన్నారు.

ఈద్గాను అభివృద్ధి చేసుకుందాం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ ఈద్గాను అన్నివిధాలా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గాను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈద్గా అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

'మహా నగరోత్సవం' ఏర్పాట్ల పరిశీలన..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో చేపట్టిన 'మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవం' ఏర్పాట్లను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ నగరోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.



శిల్పారామంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు..

హన్వాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని.. ప్రజాపాలనలో ఎవరికీ అన్యాయం జరగదని ఎమ్మెల్యే యెన్నం అన్నారు. మండలంలోని వేపూర్, కిష్టంపల్లి, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో పర్యటించారు. వేపూర్‌లో రూ. 15లక్షలతో యాదవ కమ్యూనిటీ భవనం, రూ. 1.50 కోట్లతో కిష్టంపల్లి – జూలపల్లి బీటీరోడ్డు, రూ. 5లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీ భవన పనులను పరిశీలించారు. గొండ్యాల్‌లో పోచమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. మండలంలో అభివృద్ధి పనులకు రూ. 6కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు శాంతన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

నవాబుపేట: మండలంలోని కొల్లూరు సమీపంలో గల సర్వేనంబర్ 8లోని 11 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని కొందరు గ్రామస్తులు గురువారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాం నాయక్‌లకు ఫిర్యాదు చేశారు. రూ.లక్షల విలువైన భూమి అన్యాక్రాంతమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల ఫోరం సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మహబూబ్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఫోరం సమావేశం నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఫోరం చైర్మన్‌తో పాటు టెక్నిక్ మెంబర్ నాగేశ్వరరావు సీజీఎం రామాంజనాయక్, ఇండిపెండెంట్ మెంబర్ వెంకట్ హాజరవుతారని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఫోరం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: చిలకూరి బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్ ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ డిమాండ్ చేశారు. గురువారం పీయూలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చకుడిపై దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. రాజ్యాంగం ఎవరిపై కూడా వివక్ష చూపించకూడదని చెబుతుందని.. ఆలయాల్లో ప్రవేశాలను వ్యతిరేకించి, శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గణేష్, దాసు, మారుతి, శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థన

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో గురువారం రాత్రి ముస్లింలు షబ్‌–ఎ–బరాత్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షబ్‌–ఎ–బరాత్ దైవ సందేశం, నాతే షరీఫ్, సలాం, దువాలను చదువుతూ రాత్రంతా జాగరణ చేశారు. కొందరు ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో అఖండజ్యోతుల ఊరేగింపు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వీరన్నపేట శ్రీచౌడేశ్వరి దేవి అఖండజ్యోతి ఉత్సవాలను గురువారం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి అఖండ జ్యోతులను మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు విశ్వనాథ్, అధ్యక్షుడు నలిగేశి లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్లు అంజయ్య, చెన్న వీరయ్య, తొగుట వీరక్షత్రియ కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు ట్రాక్టర్లతో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు.

ఘనంగా కలశాభిషేకం పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం సింహగిరిలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం వైభవంగా ముగిశాయి. ఉదయం సుప్రభాత నిత్యోత్సవాన్తరం, చతుస్థానార్చనలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. 108 వెండి కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం, అనంతరం చక్రతీర్థం, సాయమారాధన, ద్వాదశారాధన పూజలు చేశారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.